

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 20.0

సెప్టెంబరు నాటికి విద్యుదుత్పత్తి!



- ఇక వేగంగా వైటీపీఎస్
- ప్రజాభిప్రాయ సేకరణ ముగియడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- పనుల పరిస్థితిపై ఆరాతీసిన ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ

నల్లగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంవద్ద 4,000 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ (వైటీపీఎస్)లో సెప్టెంబరు నాటికి మొదటిదశ విద్యుదుత్పత్తి ప్రారంభించాలనేదిశగా ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కీలకమైన ప్రజాభిప్రాయసేకరణ కూడా పూర్తవడంతో ఇక పనుల కొనసాగింపుపై దృష్టిపెట్టాలని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు జెన్‌కో ఇంజనీర్లను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్టు తెలిసింది. ఓ వైపు ఈప్రాజెక్టు నిర్మాణ పనులపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నడుమ రాజకీయ పోరు నడుస్తున్నా, అధికారయంత్రాంగం మాత్రం పనుల కొనసాగింపునకు చర్యలు తీసుకుంటోంది. పనుల కొనసాగింపునకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజాభిప్రాయసేకరణకు హాజరైన ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం.రిజ్వీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సెప్టెంబరు నాటికి రెండు యూనిట్లు సిద్ధం చేయాలని నిర్ణయించారు.

ప్రశాంతంగా ప్రజాభిప్రాయసేకరణ

వైటీపీఎస్‌లో కీలకమైన పర్యావరణ అంశాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలమేరకు నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణలో బలమైన ప్రతికూల అంశాలను ఎవరూ వెలిబుచ్చలేదు. పర్యావరణ అంశాలపై ఆందోళన వ్యక్తం చేసిన మానవ హక్కుల నేత హరీందర్, సామాజికవేత్త చెన్నకేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి లేవనెత్తిన సాంకేతిక అంశాలకు పరిష్కారంగా కాలుష్యనిరోధక చర్యల్లో ఆధునిక సాంకేతికతను వాడతామని జెన్‌కో డైరెక్టర్ హామీ ఇచ్చారు. స్థానికులు లేవనెత్తిన పరిహార సమస్యలు, ఉద్యోగ భద్రతాకార్డులు, ఆర్‌అండ్‌ఆర్ కేంద్రాల ఏర్పాటును పరిష్కరిస్తామని జెన్‌కో అధికారులు చెప్పడంతో ప్లాంట్ నిర్మాణానికి ఆటంకాలు తొలగినట్లేనని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణలో వచ్చిన అభిప్రాయాలన్నింటినీ క్రోడీకరించి కలెక్టర్ ద్వారా కేంద్ర పర్యావరణ శాఖకు నివేదించేందుకు జెన్‌కో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర పర్యావరణశాఖ త్వరలో నిర్వహించే సమావేశంలో ఈ నివేదికను సమర్పించడం ద్వారా జెన్‌కో ఈ ప్లాంటులో విద్యుదుత్పాదన చేపట్టేందుకు అనుమతులు కోరనుంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన ఒకటి, రెండు మాసాల్లో జరిగే సమావేశంలో ఈ అనుమతులు వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

పనుల కొనసాగింపుపై దృష్టిసారించాలని నిర్ణయం

ప్రభుత్వం మారడం, పలు ఆటంకాలు ఎదురుకావడం, కీలకమైన పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ ఘట్టం నేపథ్యంలో కొన్నాళ్లుగా వైటీపీఎస్‌లో పనులు మందగించాయి. ఇప్పటికే రెండు యూనిట్ల పనులు 80శాతం మేర, మిగిలిన మూడు యూనిట్లు 70శాతం మేర పూర్తవడంతో పాటు కీలకమైన రైల్వేలైన్ పనులు, హైటెన్షన్ విద్యుత్‌లైన్ టవర్ల నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. వీటితో పాటు బిల్లులు పెండింగ్‌లో ఉండటం, సామగ్రి సరఫరా నిలిచి పోవడంతో సివిల్ పనుల నిర్వహణకు బ్రేక్‌పడింది. ఇటీవల స్పందించిన జెన్‌కో ఉన్నతాధికారులు పర్యావరణ అభిప్రాయసేకరణ అనంతరం పనులు యథావిధిగా కొనసాగిస్తామని ప్రకటించారు. మంగళవారం ప్రజాభిప్రాయసేకరణకు హాజరైన సీఎండీ రిజ్వీతో పాటు, జెన్‌కో ఉన్నతాధికారులు, కలెక్టర్ హరిచందనతో కలిసి ప్లాంట్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. మొదటి దశలోని రెండు యూనిట్ల పనులను యుద్ధప్రాతిపదికన కొనసాగించాలని, అదేవిధంగా రైల్వేలైన్, వాటర్‌లైన్ పనులు వేగవంతం చేయాలని, సెప్టెంబరు నాటికి ఈ యూనిట్లను విద్యుదుత్పత్తికి సిద్ధం చేయాలని వారు ఆదేశించారు. ఈ లోగా స్థానికులు లేవనెత్తిన అన్ని సమస్యలకు అంచెలవారీగా పరిష్కరించాలని నిర్ణయించడంతో ఇకపై ప్లాంట్ పనుల్లో వేగం పెంచేందుకు జెన్‌కో యంత్రాంగం సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

పగలు భగ భగ రాత్రి గజ గజ

భిన్నమైన వాతావరణ పరిస్థితులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, రాత్రి వేళ చలిగాలులు బలంగా వీస్తున్నాయి. జిల్లాలో ఏర్పడ్డ ప్రతికూల వాతావరణ పరిస్థితులు ప్రజారోగ్యంతోపాటు పంటలను దెబ్బతీస్తున్నాయి. శివరాత్రికి ముందే భానుడి ప్రతాపం మొదలవుతున్న నేపథ్యంలో ఈ దఫా వేసవి తీవ్రత గతంతో పోల్చితే ఎక్కువగానే ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

\- మిర్యాలగూడ అర్బన్, మోత్కూరు




మోత్కూరులో పూత రాలిన మామిడి తోట

- క్రమంగా పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- సాయంత్రం చలిగాలులు
- పంటలకు ప్రతికూల వాతావరణం
- ఎదుగుదల కుంటుపడిన వరి చేలు, ఆపై అగ్గి తెగులు
- ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న భిన్న వాతావరణం
- జలుబు, జ్వరాలు, ఒళ్లనొప్పులతో ఇక్కట్లు

తెల్లవారుజామున మంచుప్రభావం ఎక్కువగా ఉంటుండగా, ఉదయం 9గంటల తరువాత ఎండతీవ్రత పెరుగుతోంది. తిరిగి సాయంత్రం 6గంటల నుంచే చలిగాలులు ఉంటున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో తేడాలు కనిపిస్తున్నాయి. రాత్రివేళ చలితీవ్రత ఉంటుండగా, పగలు 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. దీంతో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 36డిగ్రీలు నమోదవుతుండగా, రాత్రి ఉష్ణోగ్రతలు 19-21 డిగ్రీల మధ్యన ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రధానంగా తలనొప్పి, జలుబు, దగ్గుతో కూడిన జ్వరాలు ప్రబలి ఒళ్లనొప్పులతో ఇబ్బందిపడుతున్నారు. గడిచిన పక్షం రోజులుగా వాతావరణంలో ఇలాంటి పరిస్థితి కనిపిస్తుండగా చిన్నా, పెద్ద తేడా లేకుండా అనారోగ్యానికి లోనవుతున్నారు. భిన్న వాతావరణ పరిస్థితులు పంటలపైనా ప్రభావం చూపుతున్నాయి.

ప్రజలు ఆస్పత్రుల బాట




భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విషజ్వరాలు ప్రబలడంతో వైద్యచికిత్స కోసం ఎక్కువమంది రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆస్పత్రులు ఓపీ ఫీజును పెంచేశాయి. గతం లో రూ.300 ఉన్న కన్సల్టేషన్ ఫీజును రూ.500కు పెంచేశారు. మెరుగైన వైద్యం పేరుతో అనవసర పరీక్షలకు సిఫారసు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. జలుబు, తలనొప్పితో ఆస్పత్రికి వెళ్తే సీటీ స్కాన్‌కు వైద్యులు రిఫర్ చేస్తున్నారు. స్కానింగ్ ఇతర రిపోర్టుల కోసం రూ.1,500 నుంచి రూ. 2,000 వరకు వ్యయం అవుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చినా వైద్యసేవలు ఆశించిన స్థాయి లో అందడం లేదన్న కారణంతో అంతా ప్రైవేట్ బాటపడుతున్నారు.

ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఆరోగ్యం దెబ్బతిని ప్రజలు ఆస్పత్రుల బాటపడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు సీజన్ వ్యాధులు సోకిన రోగులతో కిటకిటలాడుతున్నాయి. వేసవికి ముందు వాతావరణంలో సమతుల్యత దెబ్బతిన్న నేపథ్యంలో ఇలాంటి పరిస్థితి నెలకొందని వైద్యులు చెబుతున్నారు. కొవిడ్ తరువాత మళ్లీ ఇలాంటి పరిస్థితి ప్రస్తుతం ఉత్పన్నమైందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు కనీస వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఎదగని వరి చేలు

రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మంచు కురవడం, ఉదయం వేళ చలిగా ఉండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. మధ్యాహ్నం ఎండ ఉంటున్నా ఉదయం మంచు, చలి కారణంగా వరి పొలాల్లో నీరు చల్లగా ఉండి వరి ఎదుగుదలను దెబ్బతీస్తోంది. అంతేగాక ప్రతికూల వాతావరణంతో వరికి అగ్గితెగులు సోకుతోంది. కాండం తొలుచు పురుగు ఆశిస్తోంది. పొలంలో నీరు విపరీతమైన చల్లగా ఉంటుండటంతో వరి వేర్లు పోషకాలు తీసుకోలేక జింక్, పోటాషియం లాంటి పోషకాల లోపంతో తెగుళ్ల బారిన పడుతున్నాయి. రాత్రి వేళ నీరు తీసి, ఉదయమే నీరు పెడితే వేడి నీరు తగిలి చేలు ఎదుగుతాయని, తెగుళ్లు కూడా ఉండవని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అయితే మడిలో నీరు పూర్తిగా తీస్తే తిరిగి పారుతుందో లేదోనన్న భయంతో రైతులు నీరు తీయడం లేదు. ప్రస్తుతం కనీసం మూ డు అడుగులైన పెరగాల్సిన వరి ఒరం (ఒడ్డు) ఎత్తు దాటడం లేదు. కొన్ని చోట్ల వేసిన నాట్లు ఎర్రబారి పిలక రావడం లేదు. మరో నెల రోజుల్లో వరి కోతకు రావాల్సి ఉండగా, పిలక వచ్చేదెప్పుడు, ఎదిగేదెప్పుడని రైతులు ఆవేదన చెందుతున్నారు. మంచు, చలి వాతావరణంతో మామిడి తోటలు కూడా దెబ్బతింటున్నాయి. మామిడిని తేనె మంచు పురుగు ఆశిస్తోంది. పూత రాలడంతో పాటు, పిందె నుంచి కూడా రసాన్ని పీలుస్తుండటంతో పిందెలు రాలుతున్నాయి. తేనె మంచు పురుగులు విసర్జించే తేనె లాంటి జిగురుపై మసి కారకమైన శిలీంద్రాలు పెరిగి ఆకులు, కాయలపై నల్లని మసి మంగు వస్తోంది. అంతేగాక ఉదయం మంచు కారణంగా దారి కనిపించక రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు.



వారం రోజులుగా ఉష్ణోగ్రతలిలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
15న	33.5	18.4
16న	33.4	19.0
17న	34.0	19.4
18న	34.4	19.0
19న	35.0	19.4
20న	36.0	20.0
21న	35.5	20.2

కనీస జాగ్రత్తలు పాటించాలి



వాతావరణ పరిస్థితుల బట్టి ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలి. సీజనల్ జ్వరాలపై వైద్యసిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజలకు ఆరోగ్యసలహాలు, సూచనలు చేస్తున్నాం. ఏఎన్ఎం, ఆశాలు గ్రామాల్లో పర్యటించి ప్రజల ఆరోగ్యపరిస్థితులను తెలుసుకొని సంబంధిత వైద్యసిబ్బందికి సమాచారం అందజేయాలని సూచించాం. వైద్యులు సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉంటూ అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలుజారీ చేశాం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

\- డాక్టర్ కొండల్‌రావు, నల్లగొండ జిల్లా వైద్యాధికారి

వరికి అగ్గి తెగులు



నేను మూడు ఎకరాల్లో వరి నాటు వేశా. నాటు వేసి రెండుమాసాలు గడిచింది. వరికి అగ్గి తెగులు సోకింది. ఎన్ని పురుగు మందులు పిచికారీ చేసినా తగ్గడం లేదు. ప్రతికూల వాతావరణంతోనే వరికి తెగుళ్లు సోకుతున్నాయి. పిలక కూడా రాలేదు. పెట్టుబడి కూడా చేతికి వచ్చేలా లేదు.

\- కాయితాల శంకర్‌రెడ్డి, రైతు, మోత్కూరు

పాత నీరు తీసి, కొత్త నీరు పెట్టాలి

మంచు, చలి లాంటి ప్రతికూల వాతావరణంతో వరి చేలు ఎత్తు పెరగడం లేదు. అగ్గి తెగులు కూడా ఎక్కువగా ఉంది. అగ్గి తెగులుతో వరి ఎర్రగా మారేసరికి రైతులు యూరియా ఎక్కువగా వేస్తున్నారు. యూరియా వేయకూడదు. రోజూ ఉదయమే పొలంలోని నీరు తీసి కొత్త నీరు పెట్టాలి. అగ్గితెగులు నివారణకు ఎకరాలకు 500మి.లీ., కాసుగామైసిన్ లేదా, 300 మి.లీ., ఐసోప్రోథియోలిన్ పిచికారీ చేయాలి.

\- టి.గోపీనాథ్, ఏఈవో, మోత్కూరు


తేనె మంచు పురుగు నివారణకు సస్యరక్షణ చేపట్టాలి

మామిడిలో తేనె మంచు పురుగు, ఇతర తెగుళ్ల నివారణకు వెంటనే ఉద్యానశాఖ అధికారుల సలహాలు తీసుకుని సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. తేనె మంచు పురుగు నివారణకు లీటరు నీటికి 0.5మి.లీ., ఇమిడాక్లోపిడ్ లేదా, 2.5మి.లీ., కోరోఫైరిపాస్ కలిపి పిచికారీ చేయా.

\- ఎస్‌కె.నసీమా, ఆత్మకూరు(ఎం) ఉద్యానశాఖ క్లస్టర్ అధికారి

దక్షిణానికి గ్రీన్‌సిగ్నల్

- రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి ముందడుగు
- 5వేల ఎకరాల భూసేకరణ
- సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 182 కి.మీ.ల పొడవు



చౌటుప్పల్, ఫిబ్రవరి 21: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రీజనల్ రింగ్‌రోడ్డు దక్షిణభాగం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంపై చర్చించారు. ఉత్తరభాగంలో ఉన్న పెండింగ్ సమస్యలతో పాటు దక్షిణ భాగానికి సంబంధించిన అనుమతులపై కూడా చర్చించారు. దీంతో గత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. దీంతో దక్షిణ భాగం రోడ్డు నిర్మాణం పట్టాలెక్కనుంది. హైదరాబాద్ చుట్టూ 60 కిలోమీటర్ల అవతల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ రీజినల్ రింగ్ రోడ్డును రెండు భాగాలుగా విభజించారు. సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 160 కిలోమీటర్ల ఉత్తర భాగంగా, సంగారెడ్డి నుంచి కంది, చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్, మర్రిగూడెం, సంస్థాన్‌నారాయణపురం మీదుగా చౌటుప్పల్ వరకు 182 కి.మీల దక్షిణ భాగంగా విభజించారు. ఉత్తర భాగం రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ 70శాతం పూర్తికాగా, ఇతర ప్రక్రియలు కొనసాగుతున్నాయి. తాజాగా దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. దీనికి సంబంధించి ఇంటర్ కాంటినెంటల్ కన్సల్టెన్సీ టెక్నోక్రాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సల్టెన్సీగా బాధ్యతలు నిర్వహిస్తుంది. రీజనల్ రింగ్ రోడ్డులో భాగంగా 182 కి.మీ.ల దక్షిణ భాగానికి సమగ్రప్రాజెక్టు నివేదిక డీపీఆర్ రూపొందిస్తుంది.

అనుమానాలు.. నిరీక్షణ నడుమ

రీజనల్ రింగ్‌రోడ్డును రెండు భాగాలుగా నిర్మిస్తున్న కేంద్ర ప్రభుత్వం మొదట ఉత్తరభాగం నిర్మాణానికి అనుమతించింది. దక్షిణ భాగంలో రోడ్డు నిర్మించతలపెట్టిన ప్రాంతాల మధ్య ట్రాఫిక్ ఉండదని, ఈ ప్రాంతం మధ్య ఎక్స్‌ప్రెస్‌వే అవసరంలేదని, గతంలో జాతీయ రహదారుల సంస్థ అధికారులు అభిప్రాయపడినట్లు వార్తలొచ్చాయి. దీంతో ఈ ప్రాజెక్టు రింగ్ రోడ్డు నిర్మాణం కాకుండా ఒకవైపు మాత్రమే రోడ్డు నిర్మితమవుతుందని మరో ప్రచారం జరిగింది. సుమారు ఏడాది కాలంగా దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి అనుమతి రాకపోవడంతో దీని నిర్మాణం ఉంటుందా? అనే చర్చ సాగింది.

ఉత్తర భాగం కంటే ఎక్కువ నిధులు

రీజినల్ రింగ్‌రోడ్ దక్షిణ భాగం నిర్మాణం 182 కి.మీ.ల వరకు ఉంటుందని ప్రాథమికంగా అలైన్‌మెంట్‌లో పేర్కొన్నారు. కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ప్రస్తుతం కన్సల్టెన్సీ పూర్తిస్థాయి అలైన్‌మెంట్‌ను ఖరారు చేయనుంది. ఉత్తరభాగం నిర్మాణానికి రూ.9,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా. దక్షిణ భాగం నిర్మాణానికి పూర్తిస్థాయి డీపీఆర్ రూపొందించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో భూసేకరణ భారం పెరగవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఉత్తర భాగం కంటే దక్షిణ భాగానికి ఎక్కువ నిధులు ఖర్చవుతున్నాయి. అంచనా ప్రకారం రూ.15వేల కోట్లు అవ్వనున్నట్టు సమాచారం.

దక్షిణానికి 5వేల ఎకరాలు

రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా 182కి.మీల మేర నిర్మించనున్న దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి సుమారు 5వేల ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తిస్థాయిలో డీపీఆర్ రూపొందించాక అధికారికంగా ఎంత భూమి అవసరం ఉంటుందనేది లెక్క తేలనుంది. ఉత్తరభాగంలో రోడ్డు నిర్మాణానికి 4,200 ఎకరాల భూమి సేకరణ లక్ష్యంగా పెట్టారు. ఉత్తరభాగం రోడ్డు నిర్మాణంతో పోలిస్తే దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి అదనంగా మరో 800 ఎకరాల భూమిని సేకరించాలి. ఉత్తరభాగంతో పోలిస్తే దక్షిణ భాగంలో ఎక్కువగా ప్రభుత్వ భూములు, అటవీ భూములు ఉన్నాయి.

నోడల్ అధికారుల పాత్ర కీలకం

కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: పార్లమెంట్ ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 18మంది జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ దివ్యాంగ ఓటర్లు, హోం ఓటింగ్ విధానం బాగా ప్రచారం చేయాలన్నారు. ఓటు ప్రాధాన్యం, ఓటు హక్కుపై విద్యాసంస్థల్లో స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సీ-విజిల్ యాప్, ఫిర్యాదుల స్వీకరణ, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన అంశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌రెడ్డి, విప్పర్ల రమేష్, పబ్బతి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్కరు పట్టభద్రులుగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావుతో కలిసి ఎంఎల్‌సీ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులుగా ఓటు నమోదు చేసుకునేందుకు మార్చి 14వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 47,291 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. అందులో సూర్యాపేట రెవెన్యూ డివిజన్‌లో 24,039 మంది, కోదాడలో 11,167 మంది, హుజూర్‌నగర్‌లో 12,085 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. ఓటు నమోదు కోసం సూర్యాపేటలో 31 కేంద్రాలు, కోదాడలో 22, హుజూర్‌నగర్‌లో 18 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 24న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు చేసే ఖర్చు ధరల పట్టికపై ఏమైనా సందేహాలు, సూచనలు ఉంటే అందించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వర్‌రావు, డాక్టర్ కొప్పుల కర్నాకర్‌రెడ్డి, ఎండీ. అబీద్, కోట గోపి, స్టాలిన్, దేగల రమేష్, ఎన్నికల డీటీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మినీ సమ్మక్క, సారలక్క జాతర ప్రారంభం

పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



గాజుల మల్కాపురం జాతరలో అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న భక్తులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 21: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం గాజులమల్కాపురం గ్రామంలో బుధవారం మినీ సమ్మక్క సారలక్క జాతర ప్రారంభమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జాతరకు తరలివచ్చారు. భక్తులు బోనాలు ఎత్తుకొని వచ్చి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు వారి మొక్కులను చెల్లించుకున్నారు. కోర్కెలను తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందిన సమ్మక్క, సారలమ్మ దేవతామూర్తుల కు నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించారు.

గిరిజన తండాల నుంచి అధికసంఖ్యలో భక్తులు జాతరకు హాజరయ్యారు. గురు, శుక్ర, శనివారాలు జాతరకు వచ్చే భక్తులందరికీ ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేసినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకట్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు బండి రామకృష్ణారెడ్డి, బండి ధనమ్మ, దొంతగాని గోపయ్య, రవీందర్‌రెడ్డి, మామిడి వెంకన్న, గుత్తికొండ రామిరెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, దేవిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, బొల్లికొండ వీరస్వామి, సొంటి అంజయ్య, నల్లగొండ మురళీ పాల్గొన్నారు.

అధికారంలోకి రావాలనే కాంగ్రెస్ హామీలు : ఈటల



తిరుమలగిరిలో విజయ సంకల్ప యాత్ర, మాట్లాడుతున్న పార్టీ నేత ఈటల రాజేందర్

•7లో..

విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 21: విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే అన్నారు. మేళ్లచెర్వులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన కేసు విషయమై బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేళ్లచెర్వులో ఓ విద్యార్థి వద్ద కొంత గంజాయి లభించిందని, అతని సమాచారం మేరకు జగ్గయ్యపేటకు చెందిన బొజ్జగాని రోహిత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతడి వద్ద 120 గ్రాముల గంజాయి లభించిందన్నారు. వెంటనే గంజాయి విక్రయిస్తున్న యువకుడితోపాటు గంజాయికి అలవాటు పడిన విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మైనర్ల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు.

పాతగుట్టలో కన్నుల పండువగా ఎదుర్కోళ్లు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 21 : పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టమైన స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం బుధవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ప్రధానాలయంలో నారసింహుడిని దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు అశ్వ వాహన సేవపై అధిష్ఠింపజేశారు. మహాలక్ష్మి అమ్మవారిని ముత్యాల పూల పల్లకి సేవలో తీర్చిదిద్దారు. స్వామి, అమ్మవార్ల సేవలను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన ఆచార్యులు ప్రత్యేక వేదికలపై అధిష్ఠింపజేశారు. అనంతరం ముక్కోటి దేవతల సాక్షిగా బ్రహ్మోత్సవ తిరుకల్యాణ సుముహూర్త నిర్ణయ ఘట్టం ఎదుర్కోలు మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఇరువైపులా అతిథులైన అధికారులు, అనధికారులు, రుత్వికులు ఆశీనులై పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు.



ఎదుర్కోలు మహోత్సవంలో అర్చకులు, ఆలయ సిబ్బంది

సింహవాహనంపై దర్శనం

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ఉదయం స్వామి వారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సింహవాహనంపై అధిష్ఠింపజేసి సేవోత్సవం నిర్వహించారు. అంతకుముందు ప్రధానాలయ యాగశాలలో మూలమంత్ర, మూర్తి మంత్ర, పంచసూక్త పఠనాలతో హోమ పూజలు జరిపారు. అలంకార సేవ ముందు అర్చకబృందం, రుత్వికులు దివ్యప్రబంధ వేద పఠనం జరిపారు.

యాదగిరికొండపై వైభవంగా వెండి జోడు సేవోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో అలంకార వెండి జోడు సేవలు వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతం, బిందెతీర్థంతో స్వామికి నిత్య పూజలు నిర్వహించారు. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యారాధనలు స్మార్త సంప్రదాయరీతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.15,04,251 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. యాదగిరీశుడిని రాష్ట్ర రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్, ఐపీఎస్ అధికారి అంజనీకుమార్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.

కులగణన సర్వేపై తీర్మానం చరిత్రాత్మకం

యాదాద్రి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, కుల సర్వేకు ప్రభుత్వం శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టి.. ఏకగ్రీవంగా ఆమోదింపచేసుకోవడం చరిత్రాత్మక ప్రక్రియ అని బీసీ కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్ అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, కుల సర్వేను చేపట్టడానికి ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధంకావడం హర్షణీయమన్నారు.

గ్రామోత్సవంతో ముగిసిన చెర్వుగట్టు జాతర

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 21 : వారం రోజుల పాటు భక్తులను విశేషంగా అలరించిన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నాటి గ్రామోత్సవంతో ముగిసాయి. గజవాహనంపై ఉత్సవమూర్తులను ఆసీనులను చేసిన పండితులు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అధిష్ఠింపజేసి మంగళవాయిద్యాల నడుమ గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయం నుంచి ఎల్లారెడ్డిగూడెం, చెర్వుగట్టు పురవీధుల్లో ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. శోభాయాత్ర ఆద్యంతం కన్నులపండువగా సాగింది. స్వామి అమ్మవార్లకు గ్రామస్థులు భక్తిపూర్వక స్వాగతం పలికారు. మంగళహారతులు పట్టి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చకులు సతీశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, సురేశ్ శర్మ, రాంబాబు శర్మ, కాంగ్రెస్ నాయకులు నేతకాని కృష్ణయ్య, రేగట్టె నర్సిరెడ్డి, గడుసు శశిధర్ రెడ్డి, వారాల రమేశ్, రేగట్టె నవీన్‌రెడ్డి, మల్ల శంకర్, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, పర్యవేక్షకుడు తిరుపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వల్లూరి శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, కిరణ్, వంశీ, రాజయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నలుగురు యువకులపై కేసు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 21: ఛత్రపతి శివాజీ జయంతి ర్యాలీలో కత్తులతో నృత్యం చేసిన నలుగురు యువకులపై కేసులు నమోదయ్యాయి. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ టూటౌన్ సీఐ వీఎన్‌డీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ఇందిరమ్మకాలనీలో ఈ నెల 19న నిర్వహించిన శివాజీ జయంతి ర్యాలీలో యువకులు కత్తులు తిప్పుతూ నృత్యం చేస్తున్నట్లు స్థానికులు డయల్-100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. విచారణలో కాలనీకి చెందిన మునుకుంట్ల కృష్ణ, కేశబోయిన కార్తీక్, గుడుగుంట్ల మధు, బాణావత్ నాగేష్‌లుగా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రియుడి ఇంటి ముందు ధర్నా

శాలిగౌరారం, ఫిబ్రవరి 21: నిశ్చితార్థం అయ్యాక పెళ్లికి నిరాకరిస్తున్న ప్రియుడి ఇంటి ఎదుట యువతి ధర్నాకు దిగింది. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఆకారం గ్రామానికి చెందిన దుప్పెల్లి ఝాన్సీ అదే గ్రామానికి చెందిన ఇంద్రకంటి వెంకటేష్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరికీ వివాహం చేసేందుకు ఈ ఏడాది జనవరిలో నిశ్చితార్థం కూడా జరిగింది. ఆ తర్వాత పెళ్లి చేసుకోవడానికి వెంకటేష్ నిరాకరిస్తుండటంతో వివాదం నడుస్తోంది. అయినప్పటికీ వెంకటేష్ నుంచి పెళ్లికి సానుకూలత రాకపోవడంతో బుధవారం బంధువుల మహిళలతో కలిసి ఝాన్సీ వెంకటేష్ ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. ఆ సమయంలో ఇంట్లో వెంకటేష్ తల్లి, సోదరి మాత్రమే ఉన్నారు. వెంకటేష్ ఇంట్లో లేరు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ధర్నా నిర్వహించినా కుటుంబ సభ్యుల నుంచి స్పందన రాకపోవడంతో ఝాన్సీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేసింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవిలయ్య తెలిపారు.

మాజీ మహిళా సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 21 : నల్లగొండ జిల్లాలో తాజా మాజీ మహిళా సర్పంచ్ ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాడ్గులపల్లికి చెందిన మాజీ సర్పంచ్ తూనం శోభ భర్త రవి గ్రామంలోని సమీప బంధువుల నుంచి, ఇతరుల నుంచి అప్పులు తీసుకున్నాడు. అవి చెల్లించాలని బుధవారం కొంతమంది ఇంటికి రావడంతో అవమానభారంతో శోభ పురుగుల మందు తాగింది. కొద్దిసేపటికి ఇంట్లోకి వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమె పరిస్థితి మెరుగ్గానే ఉందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నరేష్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి


యాదమ్మ మృతదేహం

కనగల్, ఫిబ్రవరి 21 : నల్లగొండ జిల్లా కనగల్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. గుర్రంపోడు మండలం కోయగూరోనిబావికి చెందిన మునుగు యాదమ్మ(45) (తల్లిగారు ఎంగొరారం) దర్వేశిపురంలో శుభకార్యానికి బుధవారం మధ్యాహ్నం వెళ్లి రాత్రి 8 గంటల సమయంలో సోదరుడు ఎంగొరారం గ్రామానికి చెందిన ముచ్చపోతుల విష్ణు బైక్‌పై తిరిగి ప్రయాణమైంది. మార్గమధ్యలో కనగల్ వాగు బ్రిడ్జికి కొద్దిదూరంలో నల్లగొండ నుంచి కనగల్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో యాదమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. బైకును నడుపుతున్న విష్ణుతో పాటు బైక్‌పై ఉన్న మరో మహిళ రమణమ్మకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటన నుంచి కారు వెళ్లిపోవడంతో వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..


శంకరయ్య(ఫైల్)

మునుగోడు: నల్లగొండ జిల్లా మునుగోడులో జరిగిన ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన భీమనపల్లి శంకరయ్య(75) మునుగోడులో శుభకార్యానికి హాజరై తిరిగి మోపెడ్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. కమ్మగూడెం బస్టాప్ సమీపంలోని మురుగుకాల్వలో అదుపు తప్పి పడిపోయాడు. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించేలోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు శంకరయ్య భార్య రాములమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య


యోగిత్(ఫైల్‌ఫొటో)

నార్కట్‌పల్లి: భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో బుధవారం జరిగింది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దాసరిగూడెం గ్రామానికి చెందిన పోలగోని యోగిత్(26)కు ఆరు నెలల కిందట చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన ప్రవళికతో పెళ్లి జరిగింది. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా గొడవ జరగడంతో భార్య ప్రవళిక అలిగి పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యోగిత్ బుధవారం ఇంట్లోని తన గదిలో ఉరివేసుకున్నాడు. యోగిత్ తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రైతు..


బీమా(ఫైల్‌ఫొటో)

పెద్దఅడిశర్లపల్లి: అనుమానాస్పద స్థితిలో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలో బుధవారం జరిగింది. ఎస్ఐ నర్సింహులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం నంభాపురం గ్రామానికి చెందిన రైతు రమావత్ బీమా(48) రెండు, మూడు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి కడుపులో మంటతో బాధపడుతుండగా ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేసినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హాలియాకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. బీమా భార్య సైది ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

ఎల్లారెడ్డిగూడెం శివారులో 110 గొర్రెల అపహరణ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 21 : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో రూ.10 లక్షల విలువైన గొర్రెల మంద చోరీకి గురైంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెర్వుగట్టుకు చెందిన రేగట్టె భూపాల్‌రెడ్డి ఎల్లారెడ్డిగూడెం శివారులోని తన వ్యవసాయ భూమిలో ఏడాదికాలంగా గొర్రెల పెంపకం చేపట్టారు. షెడ్డులో 110 గొర్రెలు ఉన్నాయి. వీటిని చూసుకునేందుకు సూపర్‌వైజర్‌ను నియమించుకున్నారు. కాగా ఈ నెల 15వ తేదీన అర్ధరాత్రి దొంగలు గొర్రెలను ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని సూపర్‌వైజర్ యజమానికి తెలిపాడు. స్థానికంగా అందుబాటులో లేని ఆయన మంగళవారం వచ్చి షెడ్డును పరిశీలించారు. అనంతరం చోరీపై ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోకారంలో తాళం వేసిన ఇంట్లో

వలిగొండ, ఫిబ్రవరి 21 : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం గోకారం గ్రామానికి చెందిన ఎర్వ రాంచంద్రయ్య భార్య సుశీలతో కలిసి ఈ నెల 17న మేడారం జాతరకు వెళ్లారు. దైవదర్శనం ముగించుకొని బుధవారం సాయంత్రం ఇంటికి చేరుకుని చూసే సరికి ఇంట్లో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

నిద్రిస్తున్న మహిళ..

చివ్వెంల, ఫిబ్రవరి 21 : నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం తిమ్మాపురంలో బుధవారం జరిగింది. ఎస్ఐ బీ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాపురం గ్రామానికి చెందిన కళ్ల రాములమ్మ బుధవారం తెల్లవారుజామున ఇంటి ముందు నిద్రిస్తుండగా ఆమె నోరు మూసి నాలుగు తులాల పుస్తెలతాడును దొంగ లాక్కొని పారిపోయాడు. ఆమె అరుస్తుండగా పక్కింట్లో పడుకున్న కుమారుడు మల్లారెడ్డి, కోడలు లేచివచ్చే సరికి పారిపోయాడు. ఈ ఘటనపై కుమారుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అధికారంలోకి రావాలన్న దుగ్ధతోనే కాంగ్రెస్ హామీలు

● మాజీ మంత్రి ఈటల రాజేందర్


తుంగతుర్తిలో నిర్వహించిన విజయ సంకల్ప్ యాత్రలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

యాదగిరిగుట్ట రూరల్ / ఆలేరు రూరల్/ మోటకొండూరు / ఆత్మకూర్(ఎం) / మోత్కూరు / తిరుమలగిరి / నాగారం / తుంగతుర్తి, ఫిబ్రవరి 21 : ఎలాగైనా రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న కాంక్షతోనే కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చారని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని దివాళా తీయించారని శ్వేతపత్రం విడుదల చేసిన కాంగ్రెస్ పెద్దలు, ఎన్నికల సందర్భంగా లెక్కలేనన్ని హామీలు ఎందుకిచ్చినట్లు అని ప్రశ్నించారు. విజయ సంకల్ప్ యాత్రలో భాగంగా రెండో రోజైన బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో మొదలై ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూర్(ఎం), మోత్కూరు, తిరుమలగిరి, నాగారం, తుంగతుర్తి వరకు కొనసాగింది. ఈ యాత్రలో ప్రజలనుద్దేశించి రాజేందర్ మాట్లాడారు. మహిళా పథకాలు, రైతు, యూత్ డిక్లరేషన్ తదితర పేర్లతో ఇచ్చిన హామీలెన్ని అన్నది బహుశా ఇచ్చిన నాయకులకే గుర్తు లేకపోవచ్చన్నారు. రాష్ట్రంలో సంపదకు కొదవ లేదని ప్రగల్భాలు పలికిన కేసీఆరే ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారన్నారు. చివరకు రింగ్‌రోడ్డు, ప్రభుత్వ భూములు విక్రయించినా రాష్ట్ర అప్పుకు వడ్డీ మాత్రమే చెల్లించగలిగారని, అసలు కూడా కట్టలేకపోయారన్నారు.

యాత్రలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు దాసరి మల్లేశం, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ పాల్గొన్నారు. కేసీఆర్ ఆసరా పింఛన్లు రూ.2 వేలు, దివ్యాంగులకు 3 వేలు ఇవ్వడానికే నానా తంటాలు పడగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తారని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరంపై కాకిగోల చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు మాసాలు అవుతున్నా పిల్లర్లు కుంగాయంటున్నారే గానీ అందుకు బాధ్యులైన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వచ్చే యేడాది వర్షాలు తక్కువగా కురిస్తే తుంగతుర్తి నియోజక వర్గానికి నీరే రాదన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం

దేశంలో బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యమని ఈటల రాజేందర్ అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశంలో డిజిటల్ పేమెంట్స్ తీసుకొచ్చిన ఘనత మోదీకే దక్కిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అత్యధిక ఎంపీ స్థానాల్లో గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు.

- చేనేత కార్మికుల సమస్యలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ మోత్కూరులో చేనేత కార్మికులు ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు.
- నాగారం మండల కేంద్రంలో సభ నిర్వహణ లేకపోవడంతో అభిమానులకు బీజేపీ నాయకులు అభివాదం చేసుకుంటూ వెళ్లారు.
- యాదగిరిగుట్ట, మోటకొండడూరు కార్యక్రమాల్లో నాయకులు లింగస్వామి, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్, మోటకొండూరు మండల అధ్యక్షుడు జోరుక ఏల్లేష్, జిల్లా కార్యదర్శి పీసరి తిరుమల్‌రెడ్డి, చిర్ర రవీందర్, అనంతుల పాండురంగారెడ్డి, పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, రేగు మల్లేష్ పాల్గొన్నారు.
- ఆత్మకూర్(ఎం)లో పార్టీ మండల నాయకులు తడిసిన మల్లారెడ్డి, బొట్టు అబ్బయ్య హాజరయ్యారు.
- మోత్కూరులో బీజేపీ మండల నాయకులు ఏనుగు జితేందర్‌రెడ్డి, గుజ్జ సోమనర్సయ్య, గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, బొట్టు అబ్బయ్య, బొట్టు కృష్ణయ్య, లింగాల శ్యాంసుందర్‌రెడ్డి, దీటి సందీప్, తిరుమలగిరిలో కాప రవి, దీన్‌దయాల్, బంగారు, హన్మంతు, కొండసోమయ్య, తుంగతుర్తిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, బొబ్బ భాగ్యారెడ్డి, సంకినేని రవీందర్‌రావు, మల్లెపాక సాయిబాబా, గాజుల మహేందర్, రమేష్, లింగయ్య, నాగరాజు, పాల్గొన్నారు.



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

జన సంద్రం..

వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.



మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటుచూసినా భక్త జన సంద్రం. అన్నిదారులు మేడారం వైపే.. పలుమార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు పరిసరాలన్నీ జనజాతరయ్యాయి.తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగామారింది. ఇప్పటికే కోటిమంది భక్తులు వచ్చినట్టు అంచనా.


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం

దొరికింది జాగా.. వేసేయ్ పాగా



ఆక్రమణకు గురైన ఎన్నెస్పీ కాల్వలు

ఆక్రమణకు గురైన ఎన్నెస్పీ కాల్వ కట్టలు
తాగు, సాగు నీటికి ప్రజల అవస్థలు

మఠంపల్లి, ఫిబ్రవరి 21: మండల కేంద్రం నుంచి వెళుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) కాల్వ కట్ట లు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో కాల్వల్లో నీరు సక్రమంగా ప్రవహించక తాగు, సాగు నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. మఠంపల్లి మండల కేంద్రంలో ఆర కిలోమీటర్ దూరం వరకు ఎన్నెస్పీ కాల్వ ఉంది. ప్రధానంగా మఠంపల్లిలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు నుంచి పోలీస్‌స్టేషన్ సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయం వరకు ఎన్నెస్పీ కాల్వ కట్టలు ఆక్రమణకు గురయ్యాయి. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఎన్నెస్పీ కాల్వకట్ట కుడి వైపు 28అడుగులు, ఎడమవైపు 18 అడుగులు ఉండాలి. లక్షల రూపాయల విలువచేసే ఈ కాల్వ కట్టలను కొందరు ఆక్రమించుకున్నారు. ఈస్థలాల్లో ప లువురు ఇళ్లను నిర్మించుకున్నారు. రోడ్లను ఏర్పాటు చే సుకున్నారు. దీంతో కాలువ ఆనవాలే కోల్పోయింది. కబ్జాదారులకు రాజకీయ నేతలు అండదండలు ఉన్నందునే అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడటంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఈ ఎన్నెస్పీ కాల్వ ద్వారా మఠంపల్లి చెరువును నింపేవారు. చెరువు ఆయకట్టు ద్వారా మఠంపల్లితో పాటు చుట్టుపక్కల 1500ఎకరాలకు సాగునీరు అందేది. కట్టల ఆక్రమణతో కాల్వ ఆనావాళ్ల కోల్పోయినందున చెరువుకు నీరు రావడంలేదు. దీంతో ప్రజలకు సాగు, తాగు నీరు అందండం లేదు. వేసవి కాలం ప్రార ప్రాంభానికి ముందే మఠంపల్లి చెరువు ఎండిపోయింది. దీంతో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో బోర్ల మీద ఆధారపడి సాగు చేసిన రైతులు పంటలు ఎండిపోతాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాల్వ కట్టలను ఆక్రమించుకున్నవారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు కాల్వలు ఆక్రమణబారిన పడకుండా నిఘా ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మఠంపల్లిలోని ప్రధాన రహదారి వద్ద ఆనవాలు కోల్పోయిన కాలువ

కాల్వ కబ్జాకు గురికాకుండా చూడాలి



మండల కేంద్రంలో ఉన్న ఎన్నెస్పీ కాల్వ కబ్జాకు గురికాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. కాల్వకు ఇరుపక్కలా ఉండాల్సిన భూమిని గుర్తించాలి. కట్టపై అక్రమ కట్టడాలను కూల్చివేసి హద్దులు ఏర్పాటు చేయాలి. లక్షల విలువైన ప్రభుత్వ భూమిని ఎన్నెస్పీ అధికారులు కాపాడాలి. ఆక్రమణలను తొలగించి కాలువ చివరి భూములకు నీరందేలా చూడాలి.

– కాకుమాను సుందర్, స్థానికుడు

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

మండల కేంద్రంలో ఎన్నెస్పీ కాల్వలు కబ్జాలకు గురవుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం. కాల్వల పరిరక్షణకు కృషి చేస్తాం

– భిక్షం, డీఈ, ఎన్నెస్పీ

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 20: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో గురువారం నిర్వహించే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు వీరబోయిన రమేష్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో కార్మికులతో కలసి ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర అఖిల్‌కుమార్, రవి, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత



ఏనుబాముల గ్రామంలో వెంకన్న కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భుజంగరావు

ఆత్మకూర్(ఎస్), చిలుకూరు ఫిబ్రవరి 21: కల్లు గీత కార్మికులకు కల్లు గీత కార్పొరేషన్ అండగా ఉంటుందని కార్పొరేషన్ అధికారి భుజంగరావు అన్నారు. మండలంలోని ఏనుబాముల గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు పసునూరి వెంకన్న ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి మృతి చెందాడు. వెంకన్న కుటుంబానికి కల్లుగీత కార్పొరేషన్ నుంచి వచ్చిన రూ.25వేల చెక్‌ను భుజంగరావు బుధవారం అందజేసి మాట్లాడారు. అదేవిధంగా చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు బయ్యా రాములు కల్లు గీయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. రాములు వైద్య ఖర్చుల కోసం కల్లు గీత కార్పొరేషన్ నుంచి వచ్చిన రూ.25వేల చెక్కును ఆయన కుటుంబ సభ్యులను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్బగాని భిక్షం, జిల్లా సహాయ కార్యదర్శి తండ రమేష్, వట్టికూటి నాగయ్య, బెల్లంకొండ నాగయ్య, పారేపల్లి నాగేశ్వరరావు, హుస్సేన్ పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌కు గోదావరి కీర్తి పురస్కారం



అవార్డు అందుకుంటున్న పల్లె కిషోర్‌కుమార్

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 21: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ ఏఎస్ఐగా పనిచేస్తున్న పల్లె కిషోర్‌కుమార్‌కు గోదావరి కీర్తి పురస్కారం లభించింది. కిషోర్‌కుమార్ తబల, హార్మోనియం వాయిద్యకారుడిగా, రచయితగా, గాయకుడిగా, రంగస్థల నటుడిగా రాణిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహితీ అకాడమి సౌజన్యంతో ఫిలాంతోఫిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కిషోర్ కుమార్‌కు గోదావరి కీర్తి పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ సంక్షేమ, సినిమా ఆటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డాక్టర్ ప్రతాప్, ఎం.బాలగంగాధర్, పార్థసారథి, రాజారం పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



డీఆర్ఆర్ఎం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తుంగతుర్తి, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని డీఆర్ఆర్ఎం, విద్యాభారతి పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారుల పాత్రలను విద్యార్థులు పోషించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎండీ నజీర్, మల్లయ్య, వేణుగోపాల్, శ్రీకాంత్, స్వాతి, రేణుక, మమత, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వరరెడ్డి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 21: ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆర్డీవో జగదీశ్వరరెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వివిధ పార్టీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 2లక్షల 50వేల 99 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. బీఎల్వోలు జాబితా తయారు చేశారన్నారు. జాబితాలో పొరపాట్లు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాగార్జునరెడ్డి, కమలాకర్, రవి, రాము, నరేష్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ కృష్ణయ్యకు సన్మానం

మునగాల రూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన అమరగాని కృష్ణయ్య హైదరాబాద్ ఎల్‌బీ నగర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం కోదాడ ప్రాంతానికి చెందిన పలువురు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోలీస్ మాజీ ఉన్నతాధికారి అంజయ్య, నాగాచారి, గుండా నర్సయ్య, వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు శ్రీనివాస్, నారాయణరావు, సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన మీసేవా కేంద్రాల అసోసియేషన్

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 21: జిల్లాలో ఐదు మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా, ఆ నోటిఫికేషన్ తప్పుల తడకగా ఉందని మీ సేవా కేంద్రాల అసోసియేషన్ హైకోర్టును బుధవారం ఆశ్రయించింది. జిల్లాలో కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్, సూర్యాపేటలో రెండు కేంద్రాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే సూర్యాపేట, హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసే కేంద్రాలకు ప్రత్యేక ప్రదేశాలను నిర్ణయిస్తూ నోటిఫికేషన్ జారీ చేసినా, తుంగతుర్తి, కోదాడలో ప్రదేశాలను నిర్ణయించకుండా నోటిఫికేషన్ జారీ చేసింది. 2011లో విడుదల చేసిన జీవో ప్రకారం, ప్రస్తుత మీసేవా కేంద్రాలకు 500 మీటర్ల దూరంలో కొత్తవి ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని, కేటాయించే ప్రదేశాలను కూడా నోటిఫికేషన్ తెలపాలని కోరుతూ మీ సేవా కేంద్రాల అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న డీఐఈవో జానపాటి కృష్ణయ్య

సూర్యాపేట అర్బన్, నడిగూడెం, ఫిబ్రవరి 21: విద్యార్థులు కష్టపడి చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈవో జానపాటి కృష్ణయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవానికి, నడిగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. నడిగూడెం కళాశాలను దాత సహకారంతోనే నిర్మించారని, నేటికీ అదే ఒరవడి కొనసాగడం ఈ ప్రాంతం అదృష్టమన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట, నడిగూడెం కళాశాలల్లో విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సూర్యాపేటలో కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య, లింగం, కౌన్సిలర్ తాహెర్‌పాషా, గోలి పద్మ, పాపాయ్య, రేణుక, ఆంధ్రయ్య రమణ, సైదులు, నిరంజన్‌రెడ్డి, కవిత, శ్రీనివాస్, నవీన్, వెంకటకృష్ణ, ప్రతాప్, పాల్గొన్నారు. నడిగూడెం కళాశాలతో దాత శ్రీనివాసరావు, ఏఎస్ఆర్ ఫౌండేషన్‌తో సహకారంతో నిర్మించిన ఐదు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమయ్య పాల్గొన్నారు.


విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలి

తుంగతుర్తి: విద్యార్థులు ధైర్యంగా పరీక్షల రాయాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలత అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు నిర్వహించిన ఫేర్‌వేల్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైభవంగా అధ్యయనోత్సవాలు



హుజూర్‌నగర్‌లోని రామాలయంలో పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు



హుజూర్‌నగర్, ఫిబ్రవరి 21: పట్టణంలోని రామాలయంలో శ్రీసీతా రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండో రోజు బుధవారం అధ్యయనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్వారుల సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, తిరుప్పావై సేవ, ప్రత్యేక పూజలు చేశారు. పట్టు వస్త్రాలు, తులసిమాలతో దేవతామూర్తులను అలంకరించారు. అనంతరం ఆళ్వారులకు పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో బదిరీనారాయణ, దామోదరాచార్యులు, ఈవో గుజ్జుల కొండారెడ్డి, నర్సింహాచార్యులు, భాస్కర్,పాల్గొన్నారు.

అర్వపల్లి: అర్వపల్లి శ్రీయోగనందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధ్యాయనోత్సవాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. విశేషఅర్చన, సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఈవో శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, అర్చకులు రాంబాబు, పవన్ పాల్గొన్నారు.

మఠంపల్లి: మండల కేంద్రంలోని చౌటపల్లి గ్రామంలో ఉన్న రుణ్మికి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సింగారపు సైదులు, ఈవో ఎంపీ లక్ష్మణారావు, వీరారెడ్డి, సైదులు, శివయ్యపాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి, ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు

చిలుకూరు: మండలంలోని కొమ్మబండతండాలో బొడ్రాయి ప్రతిష్ఠోత్సవం సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 108 బిందెలతో జలాధివాసం, ప్రత్యేక అభిషేకాలు, విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. గురువారం నిర్వహించే బొడ్రాయి ప్రతిష్ఠోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

తిరుమలగిరి: తిరుమలగిరి కొండపైన వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అర్చకుల వేద మంత్రాలు, వాయిద్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పార్లమెంటు ఎన్నికల్లో నల్గొండ నుంచి బరిలో ఉంటా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుక్కాని మన్మథరెడ్డి

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 21: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో నల్గొండ పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉంటానని ఉమ్మడి నల్గొండ జిల్లా బీజేపీ పార్లమెంటు కోకన్వీనర్ తుక్కాని మన్మథరెడి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థలను నెలకొల్పి ఎందరో పేద విద్యార్థుల ఉన్నతి కోసం పాటుపడుతున్నట్లు తెలిపారు తానని ఆయన అన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రపంచానికే ఆదర్శమైన నాయకుడిగా నరేంద్ర మోదీకి గుర్తింపు ఉందన్నారు నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కాకపోతే అభివృద్ధి, రక్షణ విషయంలో దేశం మరో 70సంవత్సరాలు వెనుకబడే ప్రమాదం ఉందన్నారు కార్యక్రమంలో బూర మల్సూర్ గౌడ్,పణినాయుడు, రాపర్తి హరిప్రసాద్‌గౌడ్, జల్లి గణేష్, కుంభం లక్ష్మణ్, మర్రి వెంకన్న, బండపల్లి శ్రీనివాస్, కొత్త సైదులు, కలారి వెంకట్, జటంగి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యకు కన్నీటి వీడ్కోలు



కృష్ణయ్య (ఫైల్ ఫొటో)

నేరేడుచర్ల, ఫిబ్రవరి 21: మిర్యాలగూడ కేఎన్ఎం డిగ్రీ కళాశాల లెక్చరర్, నేరేడుచర్ల సీనియర్ జర్నలిస్టు పానుగంటి కృష్ణయ్య అంత్యక్రియలు ముగిసాయి. ఆయన అంత్యక్రియలను స్వగ్రామం మండలంలోని పెంచికల్‌దిన్నెలో బుధవారం నిర్వహించారు. కృష్ణయ్య మృతదేహంపై ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చలసాని శ్రీనివాసరావు, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోలా నాగేశ్వరావు, బంటు కృష్ణ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కృష్ణయ్య మృతదేహానికి టీఎన్‌స్వామి, దొంతిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ముచ్చర్ల గోపాలకృష్ణ, కొంపెల్ల కృష్ణారావు, అంబటి నాగయ్య మాజీ సర్పంచ్ కె.సత్యనారాయణరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి నివాళులర్పించారు.

నేడు పెన్‌పహాడ్‌లో సామాజిక తనిఖీ

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్టు ఏపీవో రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 29 గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ బృందాలు ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు తనిఖీలు నిర్వహించాయని ఆయన తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా మండల స్థాయిలో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

కోదాడ ఎంవీఐగా జిలానీ



కోదాడ రూరల్, ఫిబ్రవరి 21: కోదాడ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్(ఎంవీఐ)గా ఎస్‌కె.జిలానీ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వాహనదారులు కచ్చితంగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను తరలించే బస్సులు ఫిట్‌నెస్‌ను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లెనిన్ బాటలో నడవాలి: సీపీఎం



సూర్యాపేటలో మాట్లాడుతున్న కొలిశెట్టి యాదగిరిరావు

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 21: కార్మికవర్గ నేత లెనిన్ బాటలో నడవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంవీ.భవన్‌లో నిర్వహించిన 'రెడ్ బుక్ డే' సందర్భంగా 'లెనిన్ ఓ విప్లవ ఆయుధం' అనే పుస్తకంపై ఉపన్యసించారు. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా అచరిస్తూ, బూర్జువా వర్గంపై విప్లవ బావుట ఎగరవేసిన గొప్ప వ్యక్తి లెనిన్ అన్నారు. దేశంలో మోదీ అధికారంలోకి వచ్చాక దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరచి, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, ములకలపల్లి రాములు, వేల్పుల వెంకన్న, పులుసు సత్యం, దండా వెంకటరెడ్డి, వీరబోయిన రవి యాదవ్, రాంబాబు, సైదులు పాల్గొన్నారు.



సూర్యాపేట(కలెక్టరేట్): తిరుమలగిరి మండల కేంద్రంలో నూతనంగా మీ-సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను ఈ నెల 29వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డులో అందజేయాలన్నారు. అభ్యర్థులకు మార్చి రెండో తేదీ రాత పరీక్ష, మార్చి ఐదో తేదీన మౌఖిక పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాలకు ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సెల్ నెం.9885929724ను సంప్రదించాలన్నారు.

సూర్యాపేట కల్చరల్: సూర్యాపేటకు చెందిన శ్రీవాసవిమాత సేవా సమితి వ్యవస్థాపకుడుఈగ దయాకర్‌గుప్తా, విజయలక్ష్మి దంపతులను సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో శ్రీవాసవి శాంతిధామం దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా దయాకర్‌గుప్తా దంపతులకు అఖిలభారత శ్రీవాసవిమాత ట్రస్టు సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు.

హుజూర్‌నగర్: విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారి నాగేందర్, మంగ, నగేష్, శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన సీపీఎం నాయకుడు భూక్య బాలు(58) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. బాలునాయక్ మృతదేహనికి పార్టీ సీనియర్ నాయకులు భూక్య పాండునాయక్, మాలోతు బాలునాయక్, శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సీఐటీయూ నాయకుడు రన్‌మియా, రాము, పూలమాలలు వేసి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

● మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్ పాల్గొన్నారు.

మునగాల రూరల్: మునగాల సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం మునగాల, నారాయణగూడెం, తాడువాయి, బరాఖత్‌గూడెం గ్రామాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వికాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● మఠంపల్లి మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఐదు ఎకరాలను వైద్యశాలకు కేటాయించాలని కోరుతూ సాముల శివారెడ్డి, గంగాసాని ఎల్లారెడ్డి, సయ్యద్ కరీం,చిలక కిషోర్‌రెడ్డి తదితరులు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

కోదాడ రూరల్: మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకమైన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన్న బుధవారం సన్మానించారు. నాగేశ్వరరావుకు గతంలో హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. సన్మానించిన వారిలో సింగిల్ విండో డైరెక్టర్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, కమతం వెంకటయ్య, బుడిగం నరేష్ తదితరులు ఉన్నారు.

● కోదాడ మండలంలోని తమ్మర గ్రామాన్ని కోదాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేర్చాలని సామాజిక కార్యకర్త కనగాల జనార్దన్‌రావు కలెక్టర్, తహసీల్దార్, ఆర్డీవోకు బుధవారం వినతిపత్రాలు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ్మరబండపాలెం గ్రామాన్ని 2017లో అనంతగిరి మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చారని, ఏదైనా సమస్య వస్తే 12కిలోమీటర్ల దూరం వెళ్లడం ఇబ్బందికరంగా ఉందన్నారు. గ్రామాన్ని ఇటీవల కోదాడ మునిసిపాలిటీ పరిధిలోకి తెచ్చినం దున, పోలీస్‌శాఖ పరిధిని కూడా కోదాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు మార్చాలని ఆయన కోరారు.

చిలుకూరు: మండల కేంద్రంలో కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందింది.మండల కేంద్రానికి చెందిన రైతు కొండా రాంబాబుకు చెందిన లేగదూడపై బుధవారం ఒకేసారి 10 కుక్కలు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. గ్రామంలో ఊరకుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

నడిగూడెం: పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి లక్ష్మి ప్రసన్న కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి మూడో తేదీన నిర్వహించే పల్స్ పోలియోలో టాస్క్‌ఫోర్స్ బృందాలు, ప్రతేకాధికారులు, కార్యదర్శులు, ఇతర సిబ్బంది సమర్థంగా పనిచేయాలన్నారు. 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమామాలిని, ఇమామ్, కృష్ణమూర్తి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

● ఉమ్మడి రాష్ట్రంలో డీసీసీ సభ్యురాలిగా సేవలందిస్తూ సంఘబంధం మహిళలకు సహకరించిన గొబ్బి మేరమ్మ మృతి బాధాకరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెన్నకేశవాపురం గ్రామానికి చెందిన రిటైర్డు ఉద్యోగి మేరమ్మ(67) బుధవారం గుండెపోటుతో మృతి చెందగా, ఆయనతోపాటు పలువురు నాయకులు, మహిళా సంఘాల సభ్యులు సంతాపం తెలిపారు.

నూతన్‌కల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని లింగంపల్లి జడ్పీ పాఠశాలలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ ఆర్థిక సహకారంతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బాసిత్‌అలీ, నాయకులు మట్టి నరేష్, కొరివి గంగయ్య, పాల్గొన్నారు.

మద్దిరాల: మద్దిరాల మండల కేంద్రానికి చెందిన గోల్కొండ రాజమల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వల్లపు రమేష్, భూతం చలం, భిక్షం పాల్గొన్నారు.

తిరుమలగిరి: గురుకుల ఫలితాల్లో తిరుమలగిరి మండలం నుంచి ఉత్తమ ఫలితాన్ని సాధించి సాధించిన గడ్డం రవి, ఇస్లావత్ మహేందర్‌ను తిరుమలగిరి జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు సన్మానించారు.రవి రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించడం, మహేందర్ పీజీటీ హిందీ టీచర్‌గా ఎంపికవ్వడం సంతోషకరమని హెచ్ఎం దామెర శ్రీను అన్నారు. కార్యక్రమంలో జానయ్య, హకీం, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ వెంటనే నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి జి.ఉప్పలయ్య కోరారు. మండలంలోని వెలిశాల గ్రామంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కడారి లింగయ్య, నాగులగాని వెంకన్న, కిష్టయ్య పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని నర్సింహులగూడెం గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కంబాల మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా ధారవత్ సురేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వల్లాల భాను, యల్మకంటి సోమయ్య చిత్తలూరి యల్లయ్య, రవికుమార్, నాగరాజు పాల్గొన్నారు.